
సమాచార హక్కు.. కాపాడుకుందాం..

- సమాచారం పొందడం మన హక్కు
- స.హ. చట్టంపై ఇప్పటికీ ఎంతో మందిలో అవగాహన లోపం
- కేవలం రూ.10తోనే సమాచారం పొందవచ్చు



పట్నంబజారు: సమాచార హక్కు చట్టం ప్రజలకు ఓ వరం. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఇతర అంశాలకు సంబంధించి ఏదైనా సమాచారం తెలుసుకోవడం కోసం ఎంతో మంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతూ ఉంటారు. సమాచారం పొందడానికి ఓ చట్టం ఉందని ఇప్పటికీ ఎంతో మందికి తెలియకపోవటం శోచనీయం. ప్రభుత్వ పాలనకు సంబంధించి ప్రతి విషయం ప్రజలు తెలుసుకునేందుకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్ట్) ఉంది. ప్రతి ఒక్కరూ.. సామాన్యులు కూడా ఈ యాక్ట్‌ను సద్వినియోగం చేసుకోవచ్చు. కేవలం రూ.10తో దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి సమాచారం అయినా పొందే అవకాశం ఉంది. 2005లో సమాచార హక్కు చట్టాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా పౌరులు అడిగిన సమాచారాన్ని కచ్చితంగా ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై కచ్చితంగా ఉంది.

ఏఏ అంశాలపై సమాచారం..

ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా సంస్థల నుంచి సమాచారం అడిగి తెలుసుకునే అధికారమే సమాచార హక్కు చట్టం కల్పిస్తోంది. ఈ చట్టం ప్రకారం ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా సమాచారం కోసం దరఖాస్తు చేసుకుని, కావాల్సిన వివరాలు తెలుసుకోవచ్చు. ప్రభుత్వం చేపట్టే పనుల వివరాలు, నిధుల విడుదల, వినియోగం, ఇతరత్రా అంశాలను తెలుసుకోవచ్చు. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సహాయ పౌర సమాచార అధికారి, పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు, ఫోన్ నంబర్లు ప్రజలకు కనిపించే విధంగా బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలా ఉంచకపోయినా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంది.

సమాచారం కోరే విధానం

సమాచారం కావాల్సిన వారు సంబంధిత కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఏదైనా సమాచారం కావాల్సిన వారు... తెల్ల కాగితంపై రాసి దరఖాస్తు చేసుకున్నా సరిపోతుంది. దీనిపై అవగాహన లేకపోతే పౌర సమాచార అధికారి సహాయం తీసుకోవచ్చు. కోర్టు పరిశీలనలో ఉన్న సమాచారం. కేబినెట్ సమావేశాలు, రికార్డులు, మంత్రులు.. వారి కార్యదర్శుల నిర్ణయాలు, వ్యక్తిగత భద్రతకు భంగం కలిగించే సమాచారం ఇచ్చేందుకు నిరాకరించవచ్చు. అయితే అవి కూడా ప్రజా ప్రయోజనాలకు సంబంధించినవి అయితే తప్పకుండా ఇవ్వాల్సి ఉంటుంది.

ఫీజు ఇలా...

తెల్ల రేషన్ కార్డుదారులకు దరఖాస్తు రుసుం ఉచితం. గ్రామ స్థాయి సమాచారానికి దరఖాస్తు రుసుం లేదు. మండల స్థాయిలో రూ.5, జిల్లా స్థాయిలో రూ.10 చెల్లించాల్సి ఉంటుంది. దీనిని డీడీ, చెక్కు, పోస్టల్ ఆర్డర్, నగదు రూపంలో చెల్లించవచ్చు. సమాచారాన్ని ముద్రణ రూపంలో ఇవ్వడానికి అయ్యే ఖర్చును దరఖాస్తు చేసుకున్న వారు చెల్లించాలి. సాధారణంగా దరఖాస్తు ఫీజుతో పాటు ముద్రణ రూపంలో కోరితే పేజీకి రూ.2 చొప్పున జిరాక్స్ ఖర్చులు, సీడీ రూపంలో అయితే రూ.100 చెల్లించాలి. రికార్డుల పరిశీలన విషయంలో మొదటి గంటకు ఉచితం. గంట తర్వాత ప్రతి గంటకు రూ.5 చొప్పున చెల్లించాలి.

గడువులోగా సమాచారం ఇవ్వాలి



చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న నిర్ణీత గడువులోగా సమాచారం అందజేయాలి. సమాచారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులు బాధ్యులు అవుతారు. దరఖాస్తుదారు ఫిర్యాదు మేరకు కోర్టు చట్టరీత్యా చర్యలు తీసుకునే ఆస్కారం ఉంది. ప్రతి ఒక్కరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలి. ఆర్టీఐ అనేది సామాన్యుడి చేతిలో ఒక అస్త్రంలాంటిది.

–పోలూరి వెంకటరెడ్డి, బార్ అసోసియేషన్, మాజీ అధ్యక్షుడు, న్యాయవాది

సమాచారం పొందే అంశాలు

ఆర్టీఐ చట్టం ద్వారా పత్రాలు, మెమోలు, రికార్డులు, పత్రికా ప్రకటనలపై అడగవచ్చు. అదే విధంగా ఉత్తర ప్రత్యుత్తరాలు, లాగ్ బుక్స్, ఒప్పందాలు, నివేదికలు, నమూనాలు, తనిఖీ, రికార్డులు మొదలైనవి ఉండొచ్చు. ఎలక్ట్రానిక్ రూపంలో కూడా ఉండవచ్చు. రేషన్ డీలర్ల రికార్డులు, అమ్మకాల వివరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పంచాయతీ కార్యాలయం, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించి వార్షిక నిధులు, లబ్ధిదారుల వివరాలు, సీఎం సహాయ నిధి వివరాలు, ప్రజా ప్రతినిధుల నియోజకవర్గ అభివద్ధి నిధులు, వినియోగం తదితర వివరాలు కాగితాలు, అధికారులపై ఉన్న ఆరోపణల నేపథ్యంలో ఉన్న పలు అంశాల గురించి పేపర్ స్టేట్‌మెంట్, వీడియోల రూపంలోనూ పొందవచ్చు.

క్లుప్తంగా

మొహియుద్దీన్ బాద్ షా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



లక్ష్మీపురం: నల్లచెరువు ఎత్తురోడ్డు సెంటర్‌లోని, మొహీయుద్దీన్‌పాలెంలో హజ్రత్ గౌసుల్ ఆజం దస్తగిర్(మహబూబ్ సుభాని) మనువలు సయ్యద్ షా మొహీయుద్దీన్ బాద్ షా ఖాదిరి దర్గాలో పీఠాధిపతి సమక్షంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తొలుత బాబా సమాధికి పూలతో, ధూపాలతో ప్రార్థనలు చేశారు. ఈసందర్భంగా దర్గా పీఠాధిపతి సయ్యద్ షా సులేమాన్ ఖాదిరి మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా బాబా సన్నిధికి భక్తులు హాజరవుతారని చెప్పారు. భక్తుల కోసం ప్రతి నెల చంద్రమాన 21వ రోజు, నెలలో ఒక గురువారం కచ్చితంగా అందుబాటులో ఉంటానని తెలిపారు.

24న ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల ధర్నా



లక్ష్మీపురం: ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల వేతన బకాయిలు విడుదల చేయాలని కోరుతూ ఈనె 24న ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగురి రాధాకృష్ణమూర్తి, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.శ్రీధర్ ఎం.రమేష్ బాబు తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. పది నెలలుగా బకాయిలు పెండింగ్ ఉన్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. తొమ్మిది సంవత్సరాల నుంచి పనిచేస్తున్న కనీసం హెచ్ఆర్ పాలసీ లేదని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించలేదని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తక్షణమే సమస్యలు పరిష్కరించాలని, పది నెలల వేతనాలు విడుదల చేయాలని కోరుతూ నిర్వహించనున్న ధర్నాలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, హనుమంతరావు పాల్గొన్నారు.

ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో వర్క్‌షాప్



గుంటూరు ఎడ్యుకేషన్: ఆరోగ్య భారతి ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఆరోగ్య కార్యకర్తలకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ శనక్కాయల ఉదయశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ కాకాని పద్యీరాజు ఆరోగ్య భారతితో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై మాట్లాడారు. ఆరోగ్య భారతి గుంటూరు అధ్యక్షుడు డాక్టర్ కె.శంకర్ రెడ్డి సీపీఆర్, ప్రథమ చికిత్సపై తరగతులు నిర్వహించారు. డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి సాధారణ వ్యాధులకు హోమియో చికిత్స, డాక్టర్ డి.సీతారామ్ కిషోర్ గృహ వైద్యంపై అవగాహన కల్పించారు.

వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం పంపిణీ



నగరంపాలెం: కొత్తపేట సోమువారివీధిలోని గిరిధారి మిత్ర మండలి కార్యాలయంలో ఆదివారం వయో వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ వృద్ధులను, దివ్యాంగులకు ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరు శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు జుజ్జూరు శివకుమార్, పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, గుప్తా, సింగంశెట్టి ఆంజనేయులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్, పీజీఆర్ఎస్ కార్యక్రమం

నెహ్రూనగర్: నగర ప్రజల స్థానిక సమస్యల పరిష్కారానికి సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్(0863–2224202) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల నిర్వహించనున్నట్లు చెప్పారు. అనంతరం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక'(పీజీఆర్ఎస్) కార్యక్రమం జనన, మరణ నమోదు కార్యాలయం వద్ద(పార్కింగ్ వద్ద) మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి నేరుగా అర్జీలు, ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు నగర తెలిపారు.

సైన్స్ ఫలాలు సామాన్యులకు అందాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: కార్పొరేట్ సంస్థలు పొందుతున్న సైన్స్ ఫలాలను సామాన్య ప్రజలకు చేరువ చేయాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక కార్యకర్తల శిక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ శాస్త్రీయ విజ్ఞానంపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని సూచించారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర రాహుల్ మాట్లాడుతూ సమాజంలో ప్రస్తుతం సైన్స్ కంటే సూడో సైన్స్ ప్రచారం ఎక్కువగా జరుగుతోందని, దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జేవీవీ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజం ఉన్న పరిస్థితుల్లో జనవిజ్ఞానవేదిక వంటి సైన్స్ ప్రచార సంస్థల అవసరం ఎంతో ఉందని పేర్కొన్నారు. జేవీవీ ప్రతినిధి టీఆర్ రమేష్ మాట్లాడుతూ శాస్త్ర పరిశోధనల్లో మన దేశం ఎంతో వెనుకబడి ఉందని, శాస్త్ర పరిశోధనలకు నిధులు పెంచాల్సిన అవసరముందన్నారు. డాక్టర్ ఎ.సత్యనారాయణ ప్రసాద్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం పెంచుకుని, ప్రతి విషయాన్ని శాస్త్రీయంగా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, బి.ఉదయ్‌భాస్కర్, షేక్ అహ్మద్ హుస్సేన్, ఆర్.స్వాతి, అంకారావు, అనూరాధ, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు. రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

వినికిడి లోపాన్ని సరైన పద్ధతిలో మెరుగుపరుచుకోవాలి



ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు, ప్రొఫెసర్ రవి

లక్ష్మీపురం: పెద్ద వారిలో సహజంగా వినికిడి లోపం ఏర్పడుతుందని, హియరింగ్ ఎయిడ్స్ వాడటానికి సిగ్గుపడరాదని ఆ లోపం వల్ల కుటుంబ సభ్యులు, ఇతరులు పడే ఇబ్బందులను అర్థం చేసుకోవాలని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు, ప్రొఫెసర్ కె.రవి కోరారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం 'వినికిడి లోపం, చెవి, ముక్కు, గొంతు వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహించారు. సభకు అనవేమా ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్నపుడు ఈఎన్‌టీ స్పెషలిస్ట్‌ని సంప్రదించాలని కోరారు. ఆడియో గ్రామ్ ద్వారా వినికిడికి సంబంధించిన పరీక్షలు చేస్తారని, వినికిడిని సరిదిద్దటానికి హియరింగ్ ఎయిడ్స్ ఇస్తారన్నారు. వృద్ధాప్యంలో ఈఎన్‌టీ సమస్యలు ఎక్కువగా వస్తాయని, చెవిలో హోరు, తల తిరగటం, ముక్కు వెంట రక్తం కారటం, వాయిస్‌లో మార్పులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. థైరాయిడ్ లాంటి వ్యాధుల వలన కూడా గొంతు బొంగురు పోతుందని, గొంతులో మార్పు వచ్చినప్పుడు డాక్టర్‌కి చూపించుకోవడం అవసరమని కోరారు. డాక్టర్ రవిని సంస్థ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి, సీనియర్ సభ్యులు దాసరి జాకబ్, సూర్యదేవర రవి కుమార్, చలమారెడ్డి, బసవగుప్త ప్రసంగించారు.

ఇళ్ల మధ్య మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే ఉద్యమిస్తాం

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు నూరిఫాతిమా



మహిళలతో కలసి బార్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: నివాసాల మధ్య ప్రజలకు ఇబ్బంది కలిగేలా మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తే.. ఉద్యమిస్తామని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయ కర్త షేక్ నూరిఫాతిమా హెచ్చరించారు. పాతగుంటూరు పరిధిలోని నందివెలుగు రోడ్డులో ఆదివారం సంధ్య బార్ అండ్ రెస్టారెంట్ ప్రారంభిస్తున్న క్రమంలో స్థానికులు అడ్డుకున్నారు. నివాసాలు, ఆలయాలు, నిత్యం విద్యార్థినులు తిరిగే ప్రాంతంలో మద్యం దుకాణం ఎలా ప్రారంభిస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నగర అధ్యక్షురాలు నూరి ఫాతిమా అక్కడకు చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులతో ఆమె మాట్లాడారు. ప్రజలు నివసించే ప్రాంతాల్లో బార్‌లు, వైన్స్‌లు ఏర్పాటు తగదని చెప్పారు. దీని వలన స్థానికులు ఎన్నో ఇబ్బందులు పడే అవకాశం ఉందని, బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు వారి నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మద్యం ఏరులై పారుతోందని ఆరోపించారు. అడ్డుఅదుపూ లేకుండా ఎక్కడబడితే అక్కడ మద్యం దుకాణాలను ఏర్పాటు చేయటం సిగ్గుచేటన్నారు. అధికార యంత్రాగం ఇష్టానుసారంగా నివాసాల మధ్యన ఏర్పాటుకు అనుమతులు ఇవ్వటం సరికాదని చెప్పారు. కచ్చితంగా బార్ అండ్ రెస్టారెంట్‌ను తీసివేయాలని, లేని పక్షంలో ప్రజల పక్షాన ఎంతటి పోరాటానికి వెనుకాడబోమని తెలిపారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



నగరంపాలెం: వాసవి క్లబ్ గుంటూరు గత 25 ఏళ్లుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని శ్రీ లలితా పరమేశ్వరి స్పిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ దేసు సూర్యప్రకాశరావు అన్నారు. వాసవి క్లబ్ గుంటూరు, మహిళా గుంటూరు, యువ గుంటూరు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఆర్.అగ్రహారం శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఆవరణలో 108 మంది వృద్ధులకు ఉచితంగా బియ్యం, పింఛన్లు పంపిణీ చేశారు. సభకు అధ్యక్షత వహించిన క్లబ్ అధ్యక్షులు రాయవరపు అశోక్ కుమార్ మాట్లాడుతూ వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ చరిత్రలో తొలిసారి గుంటూరు క్లబ్ ఈ ఉచిత బియ్యం పంపిణీని ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి కూనిశెట్టి చంద్రశేఖరరావు, కోశాధికారి వేమూరి ప్రదీప్‌కుమార్, రీజియన్ చైర్‌పర్సన్ మున్నలూరి గౌరీశంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ హక్కుల సాధనలో అలుపులేని పోరాటం



మాట్లాడుతున్న హైమారావు

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ హక్కుల సాధనలో అలుపులేని పోరాటం చేస్తున్నామని నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు పేర్కొన్నారు. ఎన్‌టీఏ నాలుగో ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం సంగడిగుంటలోని చలమయ్య హైస్కూల్లో నిర్వహించారు. ఈసందర్భంగా హైమారావు మాట్లాడుతూ ఉద్యమమే ఊపిరిగా, హక్కుల సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న ఎన్‌టీఏ తక్కువ కాలంలో రాష్ట్రంలోని ఉపాధ్యాయుల ఆదరాభిమానాలు చూరగొని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ముందుకు దూసుకెళ్తోందని తెలిపారు. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరావు మాట్లాడుతూ సంఘం ఏర్పడిన మూడేళ్లలోనే రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల్లో శాఖలను ఏర్పాటు చేశామని, సంఘ నిర్మాణం కోసం ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన సంఘంగా సీనియర్ నాయకుల అడుగుజాడల్లో ముందుకు సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖలీల్, గుంటూరు నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సాయి విశ్వనాథ్, పి.లలితబాబు, గౌరవ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్, ఆర్థిక కార్యదర్శి కె.వీర రాఘవులు, ఉపాధ్యక్షుడు టి.శ్రీనివాస్, ఎ.హరగోపాల్, జిల్లా కౌన్సిలర్లు సింగాల వెంకటేశ్వర్లు, ఏవీ కృష్ణారావు, ఎ.వెంకటేశ్వరరావు, చెంచయ్య, నాగరాజు, మున్ని నాయక్, రాములు నాయక్, కె.వేణుగోపాల్, వెంకాయమ్మ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లలో తాగునీటి వసతిపై తనిఖీ



తాగునీటి వసతిని పరిశీలిస్తున్న గుంటూరు రైల్వే డివిజన్ డీసీఎం కమలాకర్‌బాబు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పలు స్టేషన్లను డీసీఎం కమలాకర్ బాబు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు–మాచర్ల, రేపల్లె– గుంటూరు, గుంటూరు– మంగళగిరి స్టేషన్‌ల పరిధిలో ఈనెల 19,20వ తేదీలలో ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా తగిన చర్యలను తీసుకోవాడం జరిగిందని చెప్పారు. సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి స్టేషన్‌లలో మాచర్ల, మంగళగిరి, రేపల్లె స్టేషన్‌లలో అన్ని ప్రయాణికుల సౌకర్యాలను తనిఖీలు చేసి, తాగునీరు, మినరల్ వాటర్ అందుబాటులో లేకపోవడంతో తక్షణమే ఏర్పాట్లు చేయించినట్లు వివరించారు. వీటికి సంబంధించి స్వచ్ఛంద సంస్థలు, ప్లాట్ ఫామ్‌లపై తాగునీటి బూత్‌లతో పాటు చల్లని తాగునీటిని, సారా ఫౌండేషన్ అందించడం అభినందనీయం అన్నారు. మాచర్ల రైల్వే స్టేషన్‌లో స్టేషన్ సూపరిటెండెంట్‌కు రెండు సార్లు నివేదించాలని సూచించినట్లు చెప్పారు. పశువుల యజమానుతో అవగాహన సమావేశాలు నిర్వహించి, పశువులను రైల్వే ట్రాక్ దగ్గర వదిలివేయవద్దని సూచించారు. రైల్వే నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా యజమానులను హెచ్చరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు.

23న జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన

నెహ్రూనగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సీబీఐ సీనియర్ అధికారులతో విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వానికి క్రైస్తవ కార్యాచరణ కమిటీ నాయకులు, సామాజిక వేత్త డాక్టర్ గోళ్లమూడి రాజా సుందర బాబు విజ్ఞప్తి చేశారు. ఆదివారం సాయంత్రం అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. నగరానికి నాలుగు వైపుల క్రైస్తవుల సమాధుల తోటకు స్థలాలను కేటాయించాలని పలు కోరుతూ ఈ నెల 23వ తేదీన గుంటూరు కలెక్టరేట్ వద్ద క్రైస్తవ నాయకులు, పాస్టర్లతో కలసి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో క్రైస్తవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు మేడ్డు ప్రేమ జ్యోతి బాబు, క్రైస్తవ సంఘాల నాయకులు సంఘాల నాయకులు బండ్లమూడి మధు, గద్దె రచన శ్రీ పాల్గొన్నారు.

నగరంలో ఈస్టర్ వేడుకలు



ట్రినిటి గురు మండలంలో ప్రత్యేక ప్రార్థనలలో..

నగరంపాలెం: గుంటూరు నగరంలో ఈస్టర్ పండుగ వేడుకలు వైభవంగా జరిగాయి. వందేళ్ల క్రితం నిర్మితమైన పురాతన చర్చిల్లో, స్థానిక ప్రార్థనా మందిరాల్లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఏసుక్రీస్తు గీతాలను ఆలపించారు. ఈస్టర్ పండుగ విశిష్టతను వివరించారు. ఈస్ట్ ప్యారిస్, వెస్ట్ ప్యారిస్, నార్త్ ప్యారిస్, డాన్‌బోస్కో, నగరంపాలెం, బ్రాడీపేట తదితర ప్రధాన ప్రాంతాల్లోని చర్చిలు కిక్కిరిశాయి.


ట్రినిటి గురు మండలంలో..

కొత్తపేట కుగ్లర్ ఆస్పత్రి ఆవరణలోని ట్రినిటి గురు మండలంలో ఆదివారం ఈస్టర్ పండుగను నిర్వహించారు. రెవ.డాక్టర్ ఎ.కృపావరకుమార్ పునరుత్థాన సందేశం అందించారు. రెవ.జె.దైవాశీర్వాదం, రెవ.పి.రమేష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో కోశాధికారి బత్తుల లెనిన్, బి.గ్రేస్‌సుదర్శనం భీమరాజ్ పాల్గొన్నారు.



పాస్టర్‌కు సత్కారం

మహిళలకు చీరలు పంపిణీ



నగరంపాలెం: స్థానిక కొత్తపేట ఫ్యాన్సీ కల్యాణ మండపంలో ఆదివారం గుంటూరు పట్టణ ఫ్యాన్సీ స్టేషనరీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్, గుంటూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం, కొనకళ్ల సత్యం మిత్ర బృందం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ సమాజంలోని పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కల్యాణ మండపం ఎదురు పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మేయర్ సజీల, నాయకులు కొనకళ్ల సత్యం, కోట శేషగిరి, శేషప్రభాకర్, అచ్యుత నిరంజన్, గజ్వేల్ అంకరావు, అరపల్లి శ్రీను, తల్లం శేఖర్, అన్నవరపు చక్రధర్, కోట పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో మెలగాలి

చినకాకాని (మంగళగిరి): విపత్కర పరిస్థితులలో సామాజిక బాధ్యతతో మెలుగుతూ ప్రజలకు అండగా నిలవడమే జన సేవాదళ్ లక్ష్యమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ తెలిపారు. నగర పరిధిలోని చినకాకానిలో పది రోజులుగా సాగుతున్న జన సేవాదళ్ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా జంగాల మాట్లాడుతూ.. పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26వ తేదీన పండుగలా వేడుకలు జరుపుకోవాలన్నారు. దేశంలో నెలకొన్న ప్రమాదకర పరిస్థితులలో రెడ్ షర్ట్ వలంటీర్‌ల సేవలు ఎంతో అవసరమని తెలిపారు.

చర్చిల్లో నూరిఫాతిమా ప్రత్యేక ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న నూరిఫాతిమా

పట్నంబజారు: ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని పలు చర్చిలకు వెళ్ళి ప్రార్థనలు నిర్వహించి, పాస్టర్‌ల నుండి దీవెనలు పొందారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ ప్రేమ, దయ ఇతరులపై చూపించాలన్నదే ఏసుక్రీస్తు చూపిన మార్గమని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన మంచి మార్గంలో ముందుకు నడవాలని ఆకాంక్షించారు. సాటి వారికి సాయం అందించాలన్నారు.

4న తెనాలిలో అన్నమయ్య పాటల పోటీలు

తెనాలిటౌన్: శ్రీ వేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవా బృందం తెనాలి ఆధ్వర్యంలో మే 4వ తేదీన పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అన్నమయ్య పాటల పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు తెలియజేశారు. ఆదివారం స్థానిక బోసురోడ్డులోని దేవాలయంవద్ద కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వాసవీ అమ్మవారి దేవస్థానంలోని గీతామందిరంలో అన్నమయ్య పాటల పోటీలు జరుగుతాయని చెప్పారు. 8 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల లోపు ఎవరైనా పోటీల్లో పాల్గొన్న వచ్చని తెలిపారు. జూనియర్–1 విభాగం 8 సంవత్సరాల నుంచి 13 సంవత్సరాల వరకు, జూనియర్–2 విభాగం 14 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల వరకు, సీనియర్–1 విభాగం 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలు, సీనియర్–2 విభాగం 36 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాల వరకు పాటల పోటీలు జరుగుతాయని చెప్పారు. జూనియర్ విభాగాలకు ఒక్కొక్కదానికి మొదటి బహుమతి రూ.1000, రెండోవ బహుమతి రూ.500, మూడో బహుమతి రూ.300లు, జూనియర్–1 విభాగానికి10 మందికి ప్రోత్సాహక అందిస్తామని తెలిపారు. సీనియర్ విభాగానికి మొదటి బహుమతి రూ.500, రెండోవ బహుమతి రూ.300, మూడోవ బహుమతి రూ.200లు నిర్ణయించినట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు 9246440685 వాట్సాప్ నెంబర్‌కు తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సంప్రదాయ దుస్తులు ధరించాలని తెలిపారు.

బ్రాహ్మణ కార్పొరేషన్‌ను పునఃప్రారంభించాలి



నగరంపాలెం: బ్రాహ్మణ సామాజిక వర్గం ఆర్థికంగా వెనుకబడిందని బ్రాహ్మణ హక్కుల పోరాట కమిటీ(ఏపీ, తెలంగాణ) అధ్యక్షుడు బాలచంద్రప్రభాకరసాయిశర్మ అన్నారు. బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. బ్రాహ్మణులను అనేకచోట్ల హీనంగా చూస్తున్నారని, మరి కొన్నిచోట్ల అర్చకులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆలయ ట్రస్ట్ బోర్డుల్లో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారని ఆయన గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. సమావేశంలో కమిటీ సభ్యులు రాఘవేంద్రహర్ష, ఆదిలక్ష్మి, విజయలక్ష్మి, శేషావేణి, నాగసుధ పాల్గొన్నారు.